క్లుప్తంగా

వాలీబాల్ విజేత ఎసన్‌వాయ్



షీల్డ్ అందజేస్తున్న నిర్వాహకులు

వేమనపల్లి: మండల కేంద్రంలో మూడు రోజులుగా కొనసాగుతున్న జాతీయ స్థాయి వాలీబాల్ టోర్నమెంట్ సోమవారం ముగిసింది. మొత్తం 35జట్లు పాల్గొనగా ఎసన్‌వాయ్ విజేతగా నిలిచింది. విజేతలకు నిర్వాహకుడు, మండల బీఆర్‌ఎస్ పార్టీ అధ్యక్షుడు కోలి వేణుమాదవ్ ప్రైజ్‌మణి, షీల్డ్ అందజేశారు. ప్రథమ బహుమతి రూ.20వేలు, ద్వితీయ స్థానంలో నిలిచిన వేమనపల్లికి రూ.10వేలు, తృతీయ స్థానంలో నిలిచిన ములుగు జట్టుకు రూ.5వేల ప్రైజ్‌మణి అందజేశారు. కార్యక్రమంలో సింగిల్‌విండో చైర్మన్ కుబిడె వెంకటేషం, మాజీ సర్పంచ్‌లు కుబిడె మధుకర్, కొండగొర్ల బాపు , సీనియర్ నాయకుడు లక్ష్మీకాంత్ పాల్గొన్నారు.

ముగిసిన బాక్స్ క్రికెట్ పోటీలు



బహుమతులు అందిస్తున్న ఎస్సై ప్రవీణ్

మంచిర్యాలటౌన్: జిల్లా కేంద్రంలోని బైపాస్ రోడ్డులో గల డీఆర్ బాక్స్ క్రికెట్‌లో దుర్గం పోషం చారిటబుల్ ట్రస్టు ఆధ్వర్యంలో నిర్వహించిన క్రికెట్ టోర్నమెంట్ సోమవారం ముగిసింది. 32జట్లు పాల్గొనగా, మూడు రోజుల పాటు పోటీలను నిర్వహించారు. ఫైనల్ విజేతగా మీజాపూర్స్ గెలుచుకోగా రూ.7వేలు, రన్నర్స్ టీం అశ్విక్11కు రూ.3,500 ప్రైజ్‌మనీతో పాటు ట్రోఫీలను మంచిర్యాల పట్టణ ఎస్సై ప్రవీణ్ చేతుల మీదుగా అందించారు. కార్యక్రమంలో దుర్గం పోషం చారిటబుల్ ట్రస్టు చైర్మన్ దుర్గం రాజేశ్, నాంపల్లి శ్రీనివాస్ పాల్గొన్నారు.

క్యాలెండర్ ఆవిష్కరణ



ఆవిష్కరిస్తున్న ఎమ్మెల్యే ప్రేమ్‌సాగర్‌రావు

మంచిర్యాలటౌన్: తెలంగాణ నాలుగో తరగతి ఉద్యోగుల సంఘం క్యాలెండర్‌ను సోమవారం మంచిర్యాల ఎమ్మెల్యే ప్రేమ్‌సాగర్‌రావు ఆవిష్కరించారు. కార్యక్రమంలో అధ్యక్షుడు సుమీత్, ప్రధాన కార్యదర్శి గోవర్ధన్, కోశాధికారి శ్రీనివాస్, ఉపాధ్యక్షుడు రాజు, సంయుక్త కార్యదర్శులు పాల్గొన్నారు.

పతంగుల సందడి



గాలి పటాలతో చిన్నారులు

తాండూర్: సంక్రాంతి పర్వదినాన్ని పురస్కరించుకొని సోమవారం తాండూర్ బస్టాండ్ ఏరియా, కిష్టంపేట గ్రామాల్లో బీజేవైఎం ఆధ్వర్యంలో గాలి పటాల ఎగురవేత కార్యక్రమాన్నీ నిర్వహించారు. చిన్నారులు, యువకులు ఉత్సాహంగా పాల్గొన్నారు. కార్యక్రమంలో బీజేవైఎం జిల్లా ప్రధాన కార్యదర్శి ఏముర్ల ప్రదీప్, మండల బీజేవైఎం అధ్యక్షుడు మామిడి విఘ్నేష్, ప్రధాన కార్యదర్శి దుర్గా చరణ్, శ్రేణులు ప్రశాంత్, సాయికుమార్, కౌశిక్, సతీష్, జశ్వంత్, నిహాల్, లక్కీ, అఖిల్, సాయివదన్ పాల్గొన్నారు.

ఆదర్శ కళా సేవా సంస్థ వార్షికోత్సవం

మంచిర్యాలటౌన్: జిల్లాలోని జన్నారానికి చెందిన ఆదర్శ కళా సేవా సంస్థ 25వ వార్షికోత్సవాన్ని జిల్లా కేంద్రంలోని జెడ్పీ బాలుర పాఠశాల ఆవరణలో సోమవారం నిర్వహించారు. ఈ సందర్భంగా పలువురు కళాకారులు హాజరై పాటలతో అలరించారు. కార్యక్రమంలో నిర్వాహకులు రాజలింగం, మురళి, రమేశ్, నరేశ్, ఇషాక్, రాజు పాల్గొన్నారు.

మార్కెట్ కమిటీ మాజీ చైర్మన్ మృతి

దండేపల్లి: మండలంలోని కన్నెపల్లి మాజీ సర్పంచ్, మాజీ ఎంపీటీసీ ముత్తె రాజమల్లయ్య(70)సోమవారం అనారోగ్యంతో మృతిచెందాడు. సర్పంచ్, ఎంపీటీసీతో పాటు, లక్సెట్టిపేట మార్కెట్ కమిటీ చైర్మన్‌గా కూడా పనిచేశారు. ఆయన మృతిపై వివిధ పార్టీల నాయకులు, మాజీ ప్రజాప్రతినిధులు, గ్రామస్తులు విచారం వ్యక్తం చేశారు.

ప్రమోషన్ పత్రాలు అందజేత

శ్రీరాంపూర్: శ్రీరాంపూర్ ఏరియాలోని ఆర్కే 7గనిలో 34మంది ఉద్యోగులకు సోమవారం గని ఇన్‌చార్జీ మేనేజర్ సంతోష్ రావు చేతుల మీదుగా క్యాటగిరి ప్రమోషన్ పత్రాలు అందజేశారు. పదోన్నతి పొందిన వారు మరింత బాధ్యతతో పని చేయాలని ఆ ఉద్యోగులకు సంతోష్‌రావు సూచించారు.



దండేపల్లి: భోగి మంటల వద్ద కాలనీ వాసులు

వైభవంగా భోగి



మంచిర్యాలటౌన్: ఇందిరానగర్‌లో...




జైపూర్‌లో భోగి పండ్లు పోసుకుంటూ...

మంచిర్యాలటౌన్/చెన్నూర్/భీమారం/దండేపల్లి/చెన్నూర్‌రూరల్/జైపూర్/నస్పూర్/మంచిర్యాలఅర్బన్/మంచిర్యాలరూరల్(హాజీపూర్): జిల్లా వ్యాప్తంగా పల్లే, పట్టణం తేడా లేకుండా ప్రజలందరూ మూడు రోజుల పాటు ఉత్సాహంగా జరుపుకొనే పండుగ సంక్రాంతి. ప్రతీ లోగిలి ఇప్పటికే రంగుల క్రాంతిని సంతరించుకోగా.. సోమవారం భోగి పండుగతో పర్వదినం ప్రారంభమైంది. ప్రజలు భోగి మంటలు వేసి సంక్రాంతికి స్వాగతం పలికారు. ఇళ్ల ఎదుట రంగురంగుల ముగ్గులు వేసి గొబ్బెమ్మలు పెట్టారు. పిల్లలకు భోగి పండ్లు పోశారు. మూడు రోజుల పాటు జరిగే సంక్రాంతి పండగ కావడంతో కొత్త అల్లుళ్లు ఇళ్లకు చేరడంతో కాలనీలు సందడిగా నెలకొన్నాయి. పౌర్ణమి సందర్భంగా శివాలయాలకు భక్తులు పోటెత్తారు.అభిషేకాలు చేసి ప్రత్యేక పూజలు నిర్వహించారు.



దేవతామూర్తులను దర్శనం చేసుకుంటున్న భక్తులు



భీమారంలో భోగి మంటలు వేస్తున్న స్థానికులు

అలరించిన ముగ్గుల పోటీలు



జన్నారం: ముగ్గుల పోటీల్లో పాల్గొన్న మహిళలు



తాండూర్‌లో ముగ్గులు వేస్తున్న మహిళలు

తాండూర్: సంక్రాంతిని పురస్కరించుకొని తాండూర్ మండల యూత్ సోమవారం నిర్వహించిన ముగ్గుల పోటీలు ఎంతగానో అలరించాయి. టగ్ ఆఫ్‌వార్, కబడ్డీ పోటీలు నిర్వహించారు. విజేతలకు బహుమతులు ప్రదానం చేశారు. కార్యక్రమంలో తాండూర్ మండల రాజకీయ పక్షాల నాయకులు, ప్రభుత్వ శాఖల అధికారులు, యువకులు, మహిళలు, చిన్నారులు పాల్గొన్నారు.

జన్నారం: మండలకేంద్రంలో రాఘవేంద్ర ట్రస్టు ఆధ్వర్యంలో సోమవారం ముగ్గుల పోటీలు నిర్వహించారు. పొనకల్‌లోని 6 చోట్ల ఒకేసారి నిర్వహించిన పోటీల్లో సుమారుగా 760మంది మహిళలు పాల్గొని పోటాపోటీగా వేశారు. ఉత్తమ ప్రతిభ కనబరిచిన మహిళలకు బహుమతులు అందజేశారు.

నేడు విద్యార్థులకు సైకిల్ రేస్ పోటీలు

మంచిర్యాలరూరల్(హాజీపూర్): సంక్రాంతి పర్వదినోత్సవాన్ని పురస్కరించుకొని హాజీపూర్ మండలం గుడిపేట బుగ్గగట్టు హనుమాన్ విగ్రహం ఎదురుగా గల మైదానంలో హాజీపూర్ ప్రెస్‌క్లబ్ ఆధ్వర్యంలో 14న సైకిల్ పోటీలు నిర్వహిస్తున్నట్లు నిర్వాహకులు ఒక ప్రకటనలో తెలిపారు. అండర్-8 విభాగంలో 1, 2 తరగతులు చదివే వారు, అండర్-10 విభాగంలో 3, 4 తరగతులు, అండర్-12 విభాగంలో 5, 6 తరగతులు, అండర్-14 విభాగంలో 7, 8 తరగతులు, అండర్-17 విభాగంలో 9, 10 తరగతుల విద్యార్థులకు సైకిల్ పోటీలు నిర్వహిస్తుండగా ఔత్సాహికులు మంగళవారం ఉదయం 10గంటల వరకు పేర్లు నమోదు చేసుకోవాలని తెలిపారు. మొదటి విజేతకు రూ.3వేలు, రెండో విజేతకు రూ.1,500, పాల్గొన్న వారికీ జ్ఞాపికలు అందజేయనున్నట్లు తెలిపారు. పూర్తి వివరాలకు 99080 74636, 99485 43085 నంబర్‌లలో సంప్రదించాలన్నారు.

రెండేళ్లుగా నిధులు రావట్లే..!

- రైతువేదికల నిర్వహణకు తప్పని తిప్పలు
- ఏఈవోలపై భారం
- పట్టించుకోని ప్రభుత్వం



చెన్నూర్: రైతు సంక్షేమాన్ని దృష్టిలో పెట్టుకొని గొప్ప ఆశయంతో రైతువేదికల నిర్మాణాలు చేపట్టారు. వాటిలో రైతులకు అధిక దిగుబడి, సస్యరక్షణ చర్యలు, తదితర అంశాలపై సూచనలు, సలహాలను అవగాహన కల్పిస్తున్నారు. సభలు, సమావేశాలు నిర్వహణ లాంటి కార్యక్రమాలు చేపడుతున్నారు. వేదిక ఏర్పాటు ఉద్దేశం మంచిదే అయినప్పటికీ సౌకర్యాల కల్పనపై ప్రభుత్వం దృష్టి సారించకపోవడంతో నిర్వహణ భారంతో నిరుపయోగంగా మారే అవకాశం ఉంది. నిర్వహణపై దృష్టి సారిస్తే లక్ష్యం నెరవేరుతుందని రైతులు అంటున్నారు.

నిర్వహణకు నిధుల లేమి..

రైతుల అభివృద్ధే లక్ష్యంగా గత ప్రభుత్వం 2021లో రూ.22లక్షల నిధులతో క్లస్టర్‌కు ఒక్క రైతువేదిక చొప్పున జిల్లాలో 55 రైతు వేదికలను నిర్మించింది. రైతువేదికలకు నిధులు నిలిచిపోవడంతో నిర్వహణ భారం ఏఈవోలపై పడుతుంది. రైతులకు మేలు జరుగుతున్నప్పటికీ నిధులు నిలిచిపోవడంతో రెండేళ్లుగా ఏఈవోలు ఇబ్బంది పడుతున్నారు.

వీడియో కాన్ఫరెన్స్ యూనిట్..

గతంలో రైతువేదికల్లో అధికారులు రైతు సమావేశాలు నిర్వహించి పంటలపై అవగాహన సదస్సులు నిర్వహించిన విషయం తెలిసిందే. కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాత మండలానికి ఒక రైతువేదికను ఎంపిక చేసి వీడియో కాన్ఫరెన్స్ యూనిట్‌ను ఏర్పాటు చేశారు. ఈ రైతు వేదికల్లో ప్రతీ మంగళవారం రైతు నేస్తం కార్యక్రమం నిర్వహిస్తున్నారు. వ్యవసాయ విశ్వవిద్యాలయం నుంచి శాస్త్రవేత్తలతో రైతులకు ప్రత్యేక్ష కార్యక్రమాల ద్వారా పంటలలో చీడపీడల నివారణకు తీసుకోవాల్సిన జాగ్రత్తలు వివరిస్తున్నారు.

ఖర్చులు నెలకు రూ.10వేలు..

2021లో రైతువేదికలు ప్రారంభం కాగా నిర్వహణ కోసం ఒక్కో రైతువేదికకు నెలకు రూ.10వేల చొప్పున ప్రభుత్వం నిధులు మంజూరు చేసింది. రూ.10వేలతో వాచ్‌మెన్, స్వీపర్, విద్యుత్ బిల్లు, రైతు సమావేశాలకు తాగునీరు, ఇతర ఖర్చుల కోసం వెచ్చించారు. రెండేళ్లుగా నిర్వహణ నిధులు విడుదల కాకపోవడంతో నిర్వహణ భారం ఏఈవోలకు తడిసి మోపడవుతోంది. ప్రభుత్వం రైతు సంక్షేమాన్ని దృష్టిలో ఉంచుకొని, రైతువేదికల నిర్వహణకు నిధులు మంజూరు చేయాలని రైతులు కోరుతున్నారు.

కలెక్టర్ దృష్టికి తీసుకెళ్లాం..

రైతు వేదికలతో రైతులకు మేలు జరుగుతోంది. వేదికల్లో ఏఈవోలు అందుబాటులో ఉండడంతో ఎప్పటికప్పుడు రైతులు సమస్యలు పరిష్కరించుకుంటున్నారు. రెండేళ్లుగా నిర్వహణ కోసం నిధులు రావడం లేదు. ఈ విషయాన్ని కలెక్టర్ దృష్టికి తీసుకెళ్లాం. - ప్రసాద్, ఏడీ, చెన్నూర్

కనులపండువగా గోదాదేవి కల్యాణం

మందమర్రిరూరల్/చెన్నూర్: చెన్నూర్ జగన్నాథాలయంలో గోదా రంగనాయకుల కల్యాణం వేడుకలను ఆలయ వంశ పరంపార్య అర్చకులు దామెర మోహనాచార్యుల ఆధ్వర్యంలో సోమవారం రాత్రి అంగరంగ వైభవంగా నిర్వహించారు. కల్యాణ మహోత్సవంలో సునీల్‌రావు-సరిత దంపతులు కూర్చున్నారు. కార్యక్రమంలో అర్చకులు అనిల్‌చార్యులు, అజయ్ చార్యులు, అరుణాచార్యులు పాల్గొన్నారు. మందమర్రి పట్టణంలోని శ్రీ వేంకటేశ్వర స్వామి దేవాలయంలో గోదాదేవి రంగనాథస్వామిల కల్యాణం ఆలయ నిర్వాహకులు కనుల పండువగా జరిపించారు. భక్తులు అధిక సంఖ్యలో పాల్గొన్నారు. ప్రసాదాలు పంపిణీ చేశారు.

భీమారం: మండల కేంద్రంలోని శ్రీ కోదండరామాలయంలో సోమవారం శ్రీగోదాదేవీ రంగనాయక స్వామి కల్యాణాన్ని వేదబ్రాహ్మణుడు విశ్వేశ్వర శర్మ నేతృత్వంలో ఘనంగా జరిపించారు.



చెన్నూర్ జగన్నాథాలయంలో గోదా రంగనాయకుల కల్యాణం

జైపూర్: మండల కేంద్రంలోని భూ నీలాసమేతా శ్రీ వేంకటేశ్వర స్వామి ఆలయంతో పాటు షెట్‌పల్లి గ్రామంలోని కోదండరామాలయంలో సోమవారం గోదా రంగరాయక కల్యాణాన్ని వైభవంగా జరిపించారు. భక్తులు అధిక సంఖ్యలో తరలివచ్చారు. అనంతరం అన్నదానం చేపట్టారు.



భీమారం రామాలయంలో...



జైపూర్ వేంకటేశ్వర స్వామి ఆలయంలో...



మందమర్రి వేంకటేశ్వరస్వామి ఆలయంలో...

సంక్షిప్త వార్తలు

అయ్యప్ప ఆలయంలో ఇరుముడి పూజలు

దండేపల్లి: మండలంలోని గూడెం శ్రీ అభినవ శబరిమలై అయ్యప్ప ఆలయంలో సోమవారం ఇరుముడి పూజలు ఘనంగా నిర్వహించారు. అయ్యప్ప దీక్ష విరమణకు వెళ్తున్న పలువురు భక్తులకు, గురుస్వామి పురుషోత్తమాచార్యులు ఇరుముడి కట్టారు. శబరిమలై వెళ్లలేని కొంతమంది భక్తులు గూడెం అయ్యప్ప ఆలయంలో దీక్ష విరమణ చేసుకున్నారు.

తుదిదశకు ఏబీసీడీ వర్గీకరణ

భీమారం: ఎమ్మార్పీఎస్ ఏబీసీడీ వర్గీకరణ తుదిదశకు చేరుకుందని ప్రతి ఒక్కరూ చిత్తశుద్ధితో పనిచేయాలని చెన్నూర్ నియోజకవర్గం దళిత నాయకులు రాజ్‌కుమార్ మాదిగలకు పిలుపునిచ్చారు. ఈ మేరకు సోమవారం భీమారం మండల కేంద్రంలో వేల గొంతుకల సన్నాహక కార్యక్రమం నిర్వహించారు. ఉద్యమం అంతిమ దశకి చేరుకున్న నేపథ్యంలో ఫిబ్రవరి 7న హైదరాబాద్‌లో 'లక్షడప్పులు-వేల గొంతుకలు' అనే మహత్తర కార్యక్రమాన్ని నిర్వహిస్తున్నట్లు తెలిపారు. ఈ సభకు పెద్ద ఎత్తున మాదిగలు తరలిరా వాలని ఆయన కోరారు.

ఉచిత కంటి పరీక్షలు

మంచిర్యాలటౌన్: అంతర్జాతీయ స్వచ్ఛంద సేవా సంస్థ, లయన్స్ ఇంటర్నేషనల్ ఆర్గనైజేషన్ వ్యవస్థాపకుడు మేల్విన్‌గ్ జోన్స్ జన్మదినం సందర్భంగా జిల్లా కేంద్రంలోని శ్రీశ్రీనగర్‌లో గల రెడ్‌క్రాస్ ఆధ్వర్యంలో నిర్వహించే ఆనంద నిలయం వృద్ధాశ్రమంలో సోమవారం కంటి వైద్య శిబిరం లయన్స్ క్లబ్ ఆధ్వర్యంలో నిర్వహించారు.

మాజీ సర్పంచ్‌పై కేసు

వేమనపల్లి: ప్రభుత్వ భూముల పరిరక్షణకు ప్రభుత్వం కఠినమైన నిబంధనలు అమలు చేస్తుంటే మండలంలో రెవెన్యూ, సర్వే అధికారుల తీరు అందుకు భిన్నంగా ఉంది. అధికారుల వ్యవహారంలో వివాదాలకు నిలయంగా మారుతోంది. తాజాగా దస్నాపూర్ మాజీ సర్పంచ్ వేపూరి శంకర్‌గౌడ్‌పై భూ ఆక్రమణ కేసు నీల్వాయి పోలీస్‌స్టేషన్‌లో నమోదైంది.

క్రికెట్ టోర్నమెంట్ విజేత నర్సింగాపూర్



నగదు,మెమొంటో అందజేస్తున్న రాజారమేశ్

భీమారం: గ్రామీణ క్రీడాకారుల్లో ప్రతిభను బయటకు తీసుకొచ్చేందుకు క్రీడలు ఎంతో దోహద పడుతాయని బీఆర్‌ఎస్ చెన్నూర్ నియోజకవర్గ నాయకులు రాజారమేశ్ అన్నారు. మండలంలోని నర్సింగాపూర్‌లో ఆర్‌కే ఫౌండేషన్ ద్వారా చేపట్టిన క్రికెట్ టోర్నమెంట్ ముగింపు కార్యక్రమానికి సోమవారం ఆయన ముఖ్య అతిథిగా హాజరయ్యారు. విన్నర్‌గా నిలిచిన నర్సింగాపూర్ టీంకి రూ.15000, రన్నర్‌గా నిలిచిన భీమారం టీంకి రూ.7000తో పాటు మెమొంటోలను అందజేశారు. కార్యక్రమంలో ఆర్‌కే ఫౌండేషన్ చైర్మన్ బుక్యా రాజ్‌కుమార్, సహకార సంఘం డైరక్టర్ పానుగంటి లక్ష్మణ్, నాయకులు గుడిమల్ల వెంకటేశ్ తదితరులు పాల్గొన్నారు.

టేకు దుంగలు పంపిస్తానని మోసం

మంచిర్యాలక్రైం: బెంగాల్‌కు చెందిన ఓ గుర్తు తెలియని వ్యక్తి మంచిర్యాలలోని శ్రీవేంకటేశ్వర సామిల్ యజమాని తాడికొండ మల్లేష్‌కు టేకు కలప దుంగలు పంపిస్తానని మోసం చేశాడని ఎస్సై ప్రవీణ్‌కుమార్ తెలిపారు. పర్మిట్‌తో కూడిన టేకు కలప దుంగలు ఉన్నాయని, రూ.30వేలు పంపిస్తే పంపిస్తానని నమ్మించాడని పేర్కొన్నారు. మల్లేష్ రూ.30వేలను గత ఏడాది డిసెంబర్ 25న ఫోన్‌పే ద్వారా పంపించాడని తెలిపారు. సదరు వ్యక్తి కలప దుంగలు పంపించకపోవడంతో సోమవారం ఫిర్యాదు చేశాడని, కేసు దర్యాప్తు చేస్తున్నామని వివరించారు.

చెక్కు పంపిణీ

మందమర్రిరూరల్: మండలంలోని సారంగపల్లికి చెందిన సుగుణకు మంజూరైన సీఎంఆర్‌ఎఫ్ చెక్కును చెన్నూర్ ఎమ్మెల్యే వివేక్ వెంకటస్వామి ఆదేశాల మేరకు బ్లాక్ కాంగ్రెస్ అధ్యక్షుడు రాంచందర్ నాయకులతో కలిసి సోమవారం బాధితురాలి ఇంటికివెళ్లి అందించారు.